## క్లుప్తంగా

### రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**తిర్యాణి:** దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ఇందుకు తెలంగాణలో అన్ని పార్టీలు మేనిఫెస్టోలో పొందుపర్చాలని రజక సంఘం మండల అధ్యక్షుడు నల్లూరి జగదీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ రజక సంక్షేమం కోసం పాటుపడే పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. అన్ని పార్టీలు నాలుగు స్థానాలకు తగ్గకుండా రజకులకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని పేర్కొన్నారు.

### 'బీఆర్‌ఎస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సక్కు, కోవ లక్ష్మి

**నార్నూర్:** బీఆర్‌ఎస్‌తోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మిల సమక్షంలో గాదిగూడ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి వాఘ్మారే సతీశ్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. పదేళ్లలో దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను తెలంగాణలో సీఎం అమలు చేశారని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కోవ లక్ష్మి విజయం కోసం ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేశ్, జంగుబాయి ఆలయ కమిటీ చైర్మన్ కోడప జాకు తదితరులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిక

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమ గాయకుడు, కళాకారుడు ఇర్ఫాన్ మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కోవ లక్ష్మి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇర్ఫాన్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.


### గడపగడపకు కాంగ్రెస్ డిక్లరేషన్



కరపత్రాలు అందిస్తున్న అజ్మీర శ్యాంనాయక్

**జైనూర్:** ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమని ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకుడు అజ్మీరా శ్యాంనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు డిక్లరేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టనున్న డిక్లరేషన్ రైతులకు, కూలీలకు ఎంతో అనుకూలంగా ఉందన్నారు. ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, రమేశ్, సుద్దాల శ్రీనివాస్, ఆనంద్, నాయకులు తదితరులు ఉన్నారు.

### బీజేపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో హరీశ్‌బాబు

**కాగజ్‌నగర్‌రూరల్:** దహెగాం మండలం జెండాగూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు సమక్షంలో బీజేపీలో చేరారు. హరీశ్‌బాబు మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. దహెగాం మండల బీజేపీ అధ్యక్షుడు రాపర్తి ధనంజయ పాల్గొన్నారు.

### వైఎస్సార్‌టీపీ టికెట్‌కు ఆనందీశ్వర్ దరఖాస్తు




దరఖాస్తు చేస్తున్న మడావి ఆనందీశ్వర్

**జైనూర్:** ఆసిఫాబాద్ నియోజక వర్గ వైఎస్సార్ టీపీ టికెట్‌కు జిల్లా యువజన సంఘం నాయకుడు మడావి ఆనందీశ్వర్ మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ షర్మిల అవకాశం ఇస్తే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆత్రం భీంరావు, మనోహర్, రాజేందర్, తదితరులు ఉన్నారు.

- తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్న దొంగలు
- వరుస చోరీలతో జిల్లా ప్రజల ఆందోళన
- ఉరెళ్తే సమాచారం ఇవ్వాలంటున్న పోలీసులు

**కౌటాల:** ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలు జిల్లావాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాజాగా జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, కౌటాల, రెబ్బెన మండలాల్లో తరుచూ దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. నేరాల నియంత్రణకు ఆయా మండలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా దొంగలు చాకచాక్యంగా తమ పని ముగించుకొని వెళ్తున్నారు. పోలీస్ పెట్రోలింగ్, తనిఖీలు, కార్డన్‌సెర్చ్ నిత్యం కొనసాగుతున్నా అందరి కళ్లుగప్పి దొంగలు చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.



# ఊరెళ్తున్నారా.. ఊడ్చేస్తారు!

**తాళం వేసి ఉంటే అంతే..**

దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్తున్నారు. ఇలా తాళం వేసిన ఇళ్లను దొంగలు గుల్ల చేస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దొంగతనాలు జరుగుతున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లల్లో, ఆలయాల్లో వరుసగా చోరీలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా ఘటనల్లో పెద్ద ఎత్తున నగదు, బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురవుతున్నాయి. దొంగలు పగలు కాలనీల్లో తిరుగుతూ రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తున్నారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా అదే రోజు రాత్రి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారు.

**దొంగల బీభత్సం**

గతేడాది మొదట్లో ఆలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడిన దొంగలు, ప్రస్తుతం ఇళ్ల మీద పడ్డారు. జిల్లాలోని సగం మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. కాగజ్‌నగర్, రెబ్బెనలో రైల్వే మార్గాలు ఉండడంతో పొరుగు రాష్ట్రం నుంచి ఇటు వైపు వచ్చి చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. వరుసగా దేవాలయాల్లోని హుండీలను పగలగొట్టి అందిన కాడికి నగదు దోచుకెళ్లిన వారే మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇళ్లకు తాళం వేసి ఊరికి వెళ్లే వారు తప్పనిసరిగా పోలీసులకు, సమీప ఇంటి వారికి సమాచారం ఇవ్వాలని పేర్కొంటున్నారు. కాలనీల్లో, గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రజలు తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండడంతో పాటు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

**వరుస చోరీలు**

- కాగజ్‌నగర్ పట్టణంలో శని, ఆదివారాలు వరస దొంగతనాలు చోటు చేసుకున్నాయి. శనివారం పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని విశ్రాంత ఉద్యోగి పద్మ నివాసంలో చోరీ జరిగింది. ఈ నెల 12న పద్మ హైదరాబాద్‌కు వెళ్లగా ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో దొంగలు పడి దాదాపు రెండు తులాల బంగారు నగలు, రూ.10 వేల నగదు, 8తులాల వెండి ఆభరణాలు అపహరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.
- కాగజ్‌నగర్ పట్టణంలోని గుంటూర్ కాలనీకి చెందిన దంపతులు శనివారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువా పగల కొట్టి బంగారం, కొంత నగదు కెళ్లినట్లు తెలుస్తోంది. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పక్కింటి వారు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించినట్లు సమాచారం.

**జాగ్రత్తలు పాటిస్తే మేలు..**

- ఊరికి వెళ్తున్న విషయాన్ని ఇంటి సమీపంలో ఉన్న ఇళ్ల వారితో పాటు పోలీసులకు తెలియజేయాలి.
- ఇంటిలోని అందరు కుటుంబ సభ్యులు ఊరికి వెళ్తే విలువైన ఆభరణాలు వెంట తీసుకెళ్లాలి. లేదా బ్యాంకు లాకర్స్‌లో భద్రపర్చుకోవడం మేలు.
- విలువైన వస్తువులను బీరువాలో ఉంచవద్దు. ఇంట్లో ఎక్కువ మొత్తంలో నగదు లేకుండా చూసుకోవాలి.
- రాత్రివేళ అనుమానాస్పదంగా కాలనీలో, గ్రామాల్లో ఎవరైనా సంచరించే పోలీసులకు సమాచారం అందించాలి.
- కొందరు సామగ్రి విక్రయిస్తున్నట్లు పగలంతా కాలనీల్లో పర్యటించి తాళం వేసి ఉన్న ఇంట్లోకి రాత్రి చొరబడుతున్నారు. ముందు జాగ్రత్తగా కాలనీల్లో అనుమానంగా తిరిగే చిరు వ్యాపారులపై ఓ కన్నేసి ఉంచాలి.
- వృద్ధులు, చిన్న పిల్లలు రాత్రివేళల్లో ఇంట్లో ఉంటే ఎవరు వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో డోర్ తీయవద్దు.
- ఇంటి బయట, హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. తగు జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

**కౌటాల:** బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో స్థానిక వీరభద్ర సంఘం సభ్యులకు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఎంపీటీసీ మనీష్, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు ధర్మయ్య, రవీందర్‌గౌడ్, సత్తన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### యువత క్రీడల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి

**కౌటాల:** గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని కౌటాల పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ అన్నారు. మంగళవారం కౌటాల యూత్ ఆధ్వర్యంలో కౌటాల మినీ స్టేడియంలో ముద్రకోల్ల సురేశ్ మెమోరియల్ ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతి, నిర్వాహకులు డబ్బా గోపాల్, సాయి, ప్రణయ్, లక్కీ, శావి, దిలీప్, క్రీడాకారులు నరేష్, వెంకటేశ్, శేఖర్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

### 'ఓటరుగా నమోదు చేసుకోండి'

**కెరమెరి:** 18ఏళ్లు నిండిన వారు ఈనెల 25 వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జమీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటుహక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. సమీప బీఎల్‌వో, తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

## కొనసాగుతున్న బతుకమ్మ సంబరాలు



కాగజ్‌నగర్‌రూరల్: బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే కోనప్ప సతీమణి రమాదేవి, మహిళలు

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. తీరొక్క పూలతో మంగళవారం బతుకమ్మలు పేర్చి మహిళలు బతుకమ్మ ఆడారు. దుర్గామాత మండపాల వద్ద కోలాటాలు ఆడారు.

**కాగజ్‌నగర్‌రూరల్:** పట్టణంలోని కోనేరు కోనప్ప నిత్యాన్నదాన సత్రంలో మంగళవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోనప్ప సతీమణి రమాదేవి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

**పైకాజీనగర్‌లో..**

**దహెగాం:** మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు బతుకమ్మ పేర్చి ఆడి పాడారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్, అధ్యాపకులు నోముల చంద్రశేఖర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



వాసవీ మందిరంలో బతుకమ్మలతో మహిళలు



ఆసిఫాబాద్: పైకాజీనగర్‌లో..

## బెల్టుషాపులపై దాడులు

**దహెగాం:** మండలంలోని ఐనం గ్రామానికి చెందిన అల్లూరి శంకరయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. మద్యం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు శంకరయ్య ఇంట్లో సోదాలు చేయగా రూ. 8,500 విలువ గల మద్యం లభించిందన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

**బెజ్జూర్:** మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు బెల్టుషాపులపై దాడులు జరిపారు. దాడుల్లో రూ.5 వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉందని, ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, డబ్బులు తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**కాగజ్‌నగర్‌రూరల్:** మండలంలోని వంజిరి గ్రామ పంచాయతీలోని సీఆర్‌నగర్ గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 5వేల మద్యాన్ని స్వాధీనపర్చుకున్నట్లు రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. ఈమేరకు కిరాణా దుకాణం నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 10 మందిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



దహెగాం: స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

**చింతలమానెపల్లి:** అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. మండలంలోని రవీంద్రనగర్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా పరితోష్ సర్కార్ అనే వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచిన 5లీటర్ల నాటుసారా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బబ్లు రప్తాన్ అనే వ్యక్తి కిరాణా దుకాణంలో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 3600 విలువ గల మద్యాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలి

**రెబ్బెన(ఆసిఫాబాద్):** సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు కోరారు. ఈ మేరకు మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఎస్‌వోటూజీఎం నరేందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఓదెలు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 300 మంది కార్మికులకు దాదాపు రూ.4లక్షల ఏరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 ఆగస్టు వరకు పెరిగిన వేతనాలకు సంబంధించి ఏరియర్స్ చెల్లించాల్సి ఉందన్నారు. దసరా పండుగను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు ప్రసాద్, రాజేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

### రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి పాటించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

**ఆసిఫాబాద్:** రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి పాటించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నియమావళి అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మొత్తం 4,47,34 మంది ఓటర్లు, 414 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సీవిజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి 100 నిమిషాల్లో పరిష్కరించాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలు తదితర ప్రచారాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### రేపటి నుంచి స్వేరోస్ సంబరాలు

**కౌటాల:** స్వేరోస్ ఇంటర్నేషనల్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కౌటాలలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు స్వేరోస్ సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రేమ్‌కుమార్, సుగుణాకర్, శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌటాలలోని సదాశివపేట నలంద బుద్ధ విహార్‌లో నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్, పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీలో మొదటి బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ రూ. 25వేలు, తృతీయ రూ. 15వేలు, వాలీబాల్‌లో మొదటి బహుమతి రూ. 15 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ రూ. 5 వేలు, పాటల పోటీల్లో మొదటి బహుమతి రూ. 2500, ద్వితీయ రూ.1500, తృతీయ రూ.1000 అందిస్తామని తెలిపారు. పోటీల్లో కేవలం సిర్పూర్ నియోజకవర్గంలోని క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని, పోటీల్లో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. ఇతర వివరాలకు 9603388143, 7893047406, 8187041132లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### వ్యాధులు ప్రబలకుండా చర్యలు

**నార్నూర్:** వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. మంగళవారం మాన్కాపూర్ పరిధిలోని రాజులగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

### సీఐఎస్‌ఎఫ్ జవాన్లకు సన్మానం



జవాన్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**ఆసిఫాబాద్:** ఇటీవల సీఐఎస్‌ఎఫ్‌లో ఎంపికై విధుల్లో చేరిన జిల్లా కేంద్రానికి చెందిన యువకులు పిడుగు మనికృష్ణ, ఉమర్ బిన్ రైస్, సైద్ సుల్తాన్ అలీలను జిల్లాకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉబేద్‌బిన్ యాహియా, కార్యదర్శి పుల్లూరి శంకర్, జిల్లా చైర్మన్ నాంపల్లి శంకర్, డైరెక్టర్ రావుల వినాయక్, రావుల సవిత పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు



కౌటాల: దాండియా ఆడుతున్న మహిళలు

## భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు



గుండిరోడ్‌లోని సాయినగర్ దుర్గామాత వద్ద మహిళలు

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పట్టణంలోని ఆలయాలు, కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన మండపాల వద్ద అమ్మవారికి మహిళలు లక్షకుంకుమార్చన పూజలు, భజనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదన పు ఎస్పీ అచ్చేశ్వర్ రావు శారదా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకన్న, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, నిర్వాహకులు రవీందర్, గీత, అశ్విన్, వివేక్, మంగ, విలాస్ పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్‌రూరల్:** పట్టణంలోని ఇందిరా మార్కెట్ సమీపంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారిని పలు రకాల పండ్లతో అలంకరించారు. అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనం ఇవ్వగా, 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**కౌటాల:** మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో శ్రీ శారదా దేవి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శారదాదేవి మండపంలో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు దాండియా ఆడారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## పోలింగ్ కేంద్రం నిర్మాణ పనుల పరిశీలన

**కాగజ్‌నగర్‌రూరల్:** మండలంలోని మానిక్‌పటార్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోలింగ్ కేంద్రం నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ మంగళవారం పనులు పరిశీలించారు. రిజర్వు ఫారెస్టులోకి మానిక్‌పటార్ గ్రామం వస్తుండటంతో సిర్పూర్ (టి), కాగజ్‌నగర్ ఎఫ్‌ఆర్‌వోలు పూర్ణచందర్, వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. మానిక్‌పటార్‌కు వెళ్లే మార్గంలో రాళ్లురప్పలు ఉండటంతో ట్రాక్టర్‌తో చదును చేసి రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చనున్నట్లు ఆయన తెలిపారు.



మానిక్‌పటార్ వెళ్లే దారిని పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణగౌడ్